క్లుప్తంగా

వైభవంగా బాల కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ



జార్జిపేట ఏటిగట్టులో బాల కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

తాళ్లరేవు: బాల కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. జార్జిపేట ఏటిగట్టు వద్ద నూతనంగా నిర్మించిన ఈ ఆలయంలో వేద పండితులు పాణింగపల్లి చక్రపాణి ఆచార్యుల బ్రహ్మత్వంలో ఉదయం 10.02కు అమ్మవారి ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పుణ్య దంపతులతో ప్రత్యేక పూజలు జరిగాయి. మహా శాంతిహోమం చేసి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం పూర్ణాహుతి, గోవుకు స్వామివారి దర్శనం చేయించి, అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. భారీ అన్నదానం జరిగింది. ఆలయ కమిటీ ప్రతినిధులు రెడ్డి నరసింహమూర్తి, రెడ్డి నాగేశ్వరరావు, కడలి వెంకటరమణ, పేర్ని ఆదినారాయణమూర్తి, ఆంజనేయులు, చోడి శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఎస్సీ సామాజిక భవనానికి భూమి పూజ

కాట్రేనికోన: దొంతికుర్రులో ఎస్సీ సామాజిక భవన నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ జరిగింది. దళిత నాయకులు గెల్లా రాజేంద్రప్రసాద్, గెద్దడ వెంకటేశ్వరరావు, జొన్నాడ రాజేశ్వరరావు ఈ కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తుల ఆర్థిక సహకారంతో ఎస్సీ సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఆనందదాయకమని రాజేంద్రప్రసాద్ అన్నారు. ప్రతి గ్రామంలో సామాజిక భవనాలు అవసరమని చెప్పారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్‌కు నివాళులర్పించి, అనంతరం గ్రామస్తులు ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థులకు నమూనా పేపర్ల అందజేత

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి శిరంగు రంగనాయకమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గిడుగు సత్యనారాయణ సహకారంతో సమకూర్చిన పరీక్ష నమూనా పత్రాలను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ గుర్లింక సూర్యనారాయణ మూర్తి, హెచ్ఎం నూకల సత్యనారాయణ, అరవ నాయుడు, ఆర్.వెంకటేశ్వరరావు, పీడీ కామన మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నక్షత్ర పూజలు

ఉప్పలగుప్తం: మాఘ మాసం సందర్భంగా విలసవిల్లి గ్రామంలోని శ్రీరామ మందిరంలో నిర్వహిస్తున్న నక్షత్ర నవగ్రహపూర్వక మహా సౌర యాగ నక్షత్ర పూజలు రెండో రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యాగకర్త మున్నంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో రుత్విక బృందం ఉదయం ప్రత్యేక పూజలు చేసి, శ్రీచక్రార్చన, చండీ హోమం జరిపి, అనంతరం రాజ శ్యామల అమ్మవారికి హోమం జరిపారు. శతభిష నక్షత్ర జాతకులతో వినాయక పూజ, నక్షత్రానిక అనుసంధానమైన కదంబ వృక్షానికి పూజ, గోపూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, సూర్య భగవానుని ఆరాధించారు.

కొబ్బరి చెట్టు దగ్ధం

అమలాపురం టౌన్: పట్టణ ప్రధాన తపాలా కార్యాలయం వెనుక ఉన్న కొబ్బరి చెట్టుకు హైటెన్షన్ విద్యుత్ తీగలు తగిలి మంటలు చెలరేగాయి. గురువారం రాత్రి 9.30 సమయంలో జరిగిన ఈ ఘటనలో చెట్టు నుంచి వచ్చిన మంటలతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు వెలుతురు కమ్ముకుంది. మంటలు వాటికవే అదుపులోకి రావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ తీగలకు దగ్గరలో ఉన్న చెట్ల కొమ్మలు, ఆకులను ట్రాన్స్‌కో సిబ్బంది తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

ఏకపక్షంగా తొలగింపు

కాట్రేనికోన: మండల మహిళా సమాఖ్యలో వీఓఏ గిడ్ల జ్ఞానకుమారిని ఏపీఎం శ్రీనివాసరాజు ఏకపక్షంగా తొలగించడంపై గ్రామ సమాఖ్య సభ్యులు మండిపడ్డారు. మండలంలో స్త్రీనిధి రుణాలకు చెందిన సొమ్మును చెయ్యేరు వీఓఏ రూ.23 లక్షలకు పైబడి, వేట్లపాలెం వీఓఏ రూ.1.80 లక్షలు, రామస్వామితోటకు చెందిన వీఓఏ రూ.3 లక్షలు దుర్వినియోగం చేయగా, వారి నుంచి రికవరీ చేశారు. వీరిలో ఇద్దరిపై చర్యలు తీసుకోకుండా, రాజకీయ కక్షసాధింపు చర్యలతో తనను తొలగించారని గిడ్ల జ్ఞానకుమారి ఆరోపించింది.

ఆ ప్రచారాన్ని నమ్మవద్దు

యానాం: విద్యా శాఖలో గతంలో కాంట్రాక్టు పద్ధతిన వివిధ పాఠశాలల్లో విధులు నిర్వహించిన టీచర్లకు సంబంధించి తిరిగి ఎలాంటి నియామక ఉత్తర్వులు జారీ చేయడం లేదని, ఈ సమస్యపై పుదుచ్చేరి ప్రభుత్వానికి ఎన్నోసార్లు వినతిపత్రం అందజేసినట్లు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, తాను కాంట్రాక్టు టీచర్ల నియామకం వద్దని ప్రభుత్వానికి లేఖ ఇచ్చినట్లు పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అనుచరులు చేస్తున్న ప్రచారాన్ని నమ్మవద్దన్నారు.

వేళలకు మించి తరగతులు వద్దు

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ రీజియన్లలో పలు ప్రైవేట్ స్కూళ్లలో సమయ వేళలకు మించి తరగతులు నిర్వహిస్తున్నాయని శుక్రవారం విద్యా శాఖ డైరెక్టర్ పి.ప్రియదర్శిని తెలిపారు. వారాంతంలో, ప్రభుత్వ సెలవు రోజుల్లో తరగతులు నిషేధిస్తున్నట్లు చెప్పారు. విద్యా శాఖ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇటుక ధరకు బీటలు

- సిమెంట్ ఇటుక దెబ్బకి దిగొచ్చిన రేటు
- క్రమంగా తగ్గుముఖం పట్టిన వైనం
- ముమ్ముందు మరింత తగ్గే అవకాశం ఉందంటున్న వ్యాపారులు



తక్కువ బరువున్న సిమెంట్ ఇటుకలతో నిర్మిస్తున్న భవనం



కొమరగిరిలో ఉన్న మట్టి ఇటుక బట్టీలు

ఐ.పోలవరం: భవన నిర్మాణానికి ప్రధాన ముడి సరకైన ఇటుక ధరలు తగ్గుముఖం పట్టాయి. 2024లో ఆకాశాన్నంటిన ఇటుక ధరలతో ఇళ్ల నిర్మాణాలు చేసేవారు. ఇటుక కొనేందుకు బెంబేలెత్తిన నిర్మాణదారులు ప్రత్యామ్నాయం వైపు అడుగులు వేయడంతో, ఇటుక తయారీదారులు ఎట్టకేలకు ధరలు తగ్గించి విక్రయిస్తున్నారు. గత జూన్ నెల నుంచి ఇటుక ధర రూ.6 ఉండగా, ప్రస్తుతం రూ.9కి పెరిగింది. దీంతో మధ్య తరగతి, చిన్న కుటుంబాల వారు తాత్కాలికంగా ఇళ్ల నిర్మాణాలను నిలుపుదల చేశారు. తప్పదనుకున్న కొంత మంది మాత్రం దగ్గరలో ఉన్న సిమెంట్ ఇటుకలు, తక్కువ బరువున్న బ్రాండెండ్ సిమెంట్ ఇటుకలు సమకూర్చుకుని నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. మట్టితో తయారైన ఇటుకలకు, సిమెంట్ ఇటుకలకు భారీ వ్యత్యాసం ఉండడంతో, ప్రజలు ఒక్కసారిగా తక్కువ బరువు ఉన్న ఇటుకల వైపు మొగ్గు చూపసాగారు.

గత కొంత కాలంగా సిమెంట్ ఇటుకల నిర్మాణాలు నియోజకవర్గంలో అధికంగా కనిపిస్తున్నాయి. దీంతో ఎట్టకేలకు కాల్చి తయారు చేసిన మట్టి ఇటుక ధరలు 50 శాతం వరకూ తగ్గాయి. మరికొద్ది రోజుల్లో మరింత తగ్గే అవకాశాలున్నాయని భవన నిర్మాణ కార్మికులు, విక్రయదారులు చెబుతున్నారు.

ధరలు ఇలా..

నాణ్యతను బట్టి 2023లో వెయ్యి ఇటుకలు రూ.5 వేల నుంచి రూ.5,500 వరకు ఉండేది. 2024లో వెయ్యి ఇటుకలు రూ.8 వేల వరకూ విక్రయాలు జరిగాయి. ఇది ప్రస్తుతం రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకూ పలుకుతుంది. స్థానికంగా లభించే పరిమాణాన్ని బట్టి ధరలు పలుకుతున్నాయి. లోకల్‌గా తయారవుతున్న సిమెంట్ ఇటుక రూ.16కు లభిస్తుంది. ఈ ఇటుక పరిమాణంలో మట్టి ఇటుకలు నాలుగింతలు ఉంటుంది. నూతనంగా తక్కువ బరువైన ఇటుకలు గుంటూరు, హైదరాబాద్ నుంచి బ్రాండెడ్ కంపెనీలతో సిమెంట్ ఇటుక రూ.105 పలుకుతుంది. ఈ ఇటుక 12 మట్టి ఇటుకలతో సమానం. తక్కువ బరువు ఉన్న ఇటుక వాడటం వలన నిర్మాణ కార్మికుల సంఖ్య, వ్యయం తగ్గుతుందని నిర్మాణదారులు విశ్లేషిస్తున్నారు. ప్రధానంగా తక్కువ సమయంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతున్నాయని ఇళ్ల యజమానులు చెబుతున్నారు.

పని, ఖర్చు కలిసొస్తుంది

సిమెంట్ ఇటుక వినియోగించడం వలన ఖర్చు తగ్గుతుంది. తక్కువ సమయంలో ఇంటి నిర్మాణం పూర్తవుతుంది. మట్టి ఇటుక ధరలు అందుబాటులోకి రాకపోతే, తక్కువ బరువున్న సిమెంట్ ఇటుకలకు డిమాండ్ పెరుగుతుంది.

– ఎస్.శ్రీనివాసరాజు, గృహ నిర్మాణదారుడు, మురమళ్ల

పోటీ పెరిగింది

సాధారణ సిమెంట్ ఇటుకలతో పాటు, తక్కువ బరువు ఉన్న సిమెంట్ ఇటుకల ప్రవేశంతో పోటీ పెరిగింది. కూలీలు, ముడి సరకుల ధరలు విపరీతంగా పెరగడంతో, ఇటుక ధరలు పెంచక తప్పడం లేదు. ఇప్పుడు తగ్గుముఖం పడుతున్నాయి.

– వీరన్న, మట్టి ఇటుక తయారీదారుడు, కొమరగిరి

ధరలు ఇంకా తగ్గుతాయి

సిమెంట్ ఇటుక పోటీ రావడంతో మట్టితో తయారు చేసే ఇటుక ధర తగ్గుముఖం పట్టక తప్పదు. ఇలా ఉంటే మట్టి ఇటుక పూర్తిగా కనుమరుగవుతుంది. ఈ నేపథ్యంలోనే ముమ్ముందు మట్టి ఇటుకలు మరింత తగ్గుతాయి.

– ఎ.పండు, నిర్మాణ కార్మికుడు, కొమరగిరి

వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

అమలాపురం టౌన్: వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారి ఆత్మార్పణ దినం సందర్భంగా స్థానిక వాసవీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. పంచామృతాలతో అమ్మవారికి అభిషేకాలు చేశారు. కుంకుమార్చనతో ఆర్య వైశ్య మహిళలు పూజలతో పాటు, లలితా పారాయణ స్తోత్రం సామూహికంగా నిర్వహించారు. పట్టణ వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం స్థానిక గడియారం స్తంభం సెంటరులో వైశ్యుల ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. వైశ్య సంఘం ముఖ్య సలహాదారు వరదా సూరిబాబు తదితరులు పర్యవేక్షించారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కల్వకొలను తాతాజీ, బోణం సత్యవరప్రసాద్ పాల్గొన్నారు.

యానాం: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినాన్ని పురస్కరించుకుని స్థానిక కోరంగి నదీపాయ తీరంలో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన పూజ, పారాయణం, హోమాలు జరిగాయి.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

ఉప్పలగుప్తం: చల్లపల్లి పంచాయతీ పరిధిలో వాసాల తిప్ప సెంటర్ సమీపంలో మోటారుసైకిల్‌పై వెళ్తున్న కుంచే అనిల్‌కుమార్‌ను లారీ ఢీకొనడం తీవ్రంగా గాయపడ్డాడు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో అనిల్‌కుమార్ తల, మోకాలు భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని అమలాపురంలోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై సీహెచ్ రాజేష్ తెలిపారు.

అధికారులు పూర్తి సమాచారంతో రావాలి

కౌన్సిల్‌లో సభ్యుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ప్రవీణ్‌కుమార్

ముమ్మిడివరం: ప్రభుత్వ శాఖల అధికారులు తగిన సమాచారంతోనే కౌన్సిల్ సమావేశానికి హాజరైతేనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని పలువురు కౌన్సిలర్లు అన్నారు. నామమాత్రంగా సాధారణ ఉద్యోగులు సమావేశానికి హాజరైతే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని వారు ప్రశ్నించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశ మందిరంలో శుక్రవారం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అజెండాలోని పలు అంశాలను వాయిదా వేశారు. సమావేశంలో కౌన్సిలర్ బొంతు సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ, గత కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు సమక్షంలో సమావేశానికి హాజరు కాని ఉద్యోగులపై చర్యలు తీసుకునేందుకు నిర్ణయం తీసుకున్నామని, ఇంతవరకు ఎవరిపై చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. కమిషనర్ పి.రవివర్మ స్పందిస్తూ, అన్ని శాఖల అధికారులకు అజెండా కాపీతో పాటు, తాను స్వయంగా ఫోన్ చేసి చెబుతున్నానని, సమావేశానికి హాజరు కాని ఉద్యోగులపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. విద్యుత్ ఏఈ సమావేశానికి హాజరు కాకుండా, జూనియర్ ఇంజినీర్ నాగేశ్వరరావు హాజరు కావడంపై ఫ్లోర్‌లీడర్ ములపర్తి బాలకృష్ణ నిలదీశారు. సమస్యలు చెబితే పరిష్కరిస్తారా అని ప్రశ్నించడంతో.. నాగేశ్వరరావు సరైన సమాధానం ఇవ్వలేకపోయారు. దీంతో సమావేశాలకు బాధ్యత కలిగిన ఉద్యోగులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని బాలకృష్ణ సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు పొదలతో నిండిపోయాయనిచ వాటిని తొలగించాలని లైన్‌మన్‌కు సమాచారమిస్తే, నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ములపర్తి వివరించారు. జీతాలు తీసుకునేటప్పుడు బాధ్యతగా పనిచేయాలని లైన్‌మన్ తీరుపై చైర్మన్ ప్రవీణ్‌కుమార్, ములపర్తి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నగర పంచాయతీ, ఈపీడీసీఎల్ ఉద్యోగులు పరస్పర సమన్వయంతో పని చేయాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు. పిల్లలకు పెంటావైలెంట్ వ్యాక్సిన్ అందుబాటులో లేక ప్రైవేటు ఆస్పత్రిలో వేయించాల్సి వస్తుందని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ములపర్తి అర్బన్ పీహెచ్‌సీ సూపర్‌వైజర్‌ను ప్రశ్నించగా, వ్యాక్సిన్ సరఫరాలో జాప్యం జరిగిందని వివరించారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వడంలో జాప్యం జరుగుతోందని గృహ నిర్మాణానికి సంబంధించి పొజిషన్ సర్టిఫికెట్ కూడా అప్లోడ్ చేయాల్సిన అవసరం ఉందని ఫ్లోర్‌లీడర్ ములపర్తి రెవెన్యూ అధికారుల దృష్టికి తెచ్చారు. అలాగే 40 ఏళ్లుగా ప్రభుత్వ భూముల్లో ఉంటున్న వారికి పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని కౌన్సిలర్ అడబాల సతీష్ కుమార్ రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ దృష్టికి తీసువెళ్లారు. ప్రభుత్వ భూముల్లో నిబంధనల ప్రకారం పొజిషన్ సర్టిఫికెట్ ఇవ్వరాదని ఆయన వివరణ ఇచ్చారు. గృహ నిర్మాణ శాఖలో ఇళ్ల మంజూరుకు రూ.3 వేలు దళారులు వసూలు చేస్తున్నారని కౌన్సిలర్ గంజా శ్రీనివాసరావు ఆరోపించారు. దీనిపై హౌసింగ్ ఏఈ సుబ్రమణ్యం మాట్లాడుతూ, ఎవరికీ ఏ విధమైన సొమ్ము ఇవ్వనవసరం లేదన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ వి.బోసు రాజు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెన్షనర్ల లైఫ్ సర్టిఫికెట్లన్నీ ఆమోదం

ఏటీవో రంగారావు



ఏటీవో రంగారావును కలసిన పెన్షనర్ల సంఘ జిల్లా ప్రతినిధులు

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు సమర్పించే జీవన్ ప్రమాణ్‌లో అప్లోడ్ చేసిన లైఫ్ సర్టిఫికెట్లు అన్నీ నేటి వరకూ ఆమోదం అయ్యాయని అమలాపురం ట్రెజరీ కార్యాలయం ఏటీవో ఎస్‌బీవీవీ రంగారావు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ జిల్లా శాఖ ప్రతినిధులు స్థానిక ట్రెజరీ కార్యాలయంలో ఏటీవో రంగారావును శుక్రవారం కలిసి, లైఫ్ సర్టిఫికెట్ల అప్లోడ్‌పై చర్చించారు. అమలాపురం సబ్ ట్రెజరీ పరిధిలో 2,893 మంది పెన్షనర్లు ఉండగా, ఇప్పటికీ సర్వీస్ పెన్షనర్స్ 1,281, ఫ్యామిలీ పెన్షనర్స్ 721, ప్రొవిజనల్ పెన్షనర్స్ ఏడుగురు, ఇతరులు ఒకరున్నారని ఏటీవో తెలిపారు. 2,010 మంది లైఫ్ సర్టిఫికెట్లు అప్రూవల్ చేసినట్టు చెప్పారు. మిగిలిన 883 మంది పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లు అప్లోడ్ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. మిగిలిన వారు తొందరగా తమ లైఫ్ సర్టిఫికెట్లను అప్లోడ్ చేయాలని సూచించారు. ఏటీవోను కలిసిన వారిలో సంఘ ప్రతినిధులు ఎన్‌వీఎస్ఎస్‌సీహెచ్ కృష్ణమూర్తి, ఎం.సాయి వరప్రసాద్, జయంతి సోమేశ్వరశర్మ తదితరులు ఉన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలనపై అవగాహన



కందికుప్పలో కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

కాట్రేనికోన: జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కందికుప్ప పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ చల్లగల వెంకటలక్ష్మి అధ్యక్షతన పల్లంకుర్రు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు స్వాతి మాట్లాడుతూ, కుష్ఠు వ్యాధి నిర్మూలనపై ప్రజలు చైతన్యవంతులు కావాలన్నారు. శరీరంపై వచ్చే స్పర్శ తెలియని మచ్చలను గుర్తించి, వైద్యులను సంప్రదించాలన్నారు. కుష్ఠు వ్యాధి ప్రారంభ దశలో ఉంటే నివారణ సాధ్యమన్నారు.

వెల్లువెత్తిన ప్రజా సమస్యలు

- అధికారుల తీరుపై సభ్యుల అసంతృప్తి
- మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కోలా గంగాభవాని

ముమ్మిడివరం: తాగునీటి సమస్య, అధికారుల గైర్హాజరు, మధ్యాహ్న భోజనం.. ఇలా అనేక సమస్యలపై మండల పరిషత్ సమావేశం శుక్రవారం వాడీవేడిగా జరిగింది. మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశానికి ఎంపీపీ కోలా గంగాభవాని అధ్యక్షత వహించారు. తొలుత వివిధ శాఖల మండల అధికారులు ప్రగతి నివేదికను ప్రవేశపెట్టారు. అయినాపురం శివారు మెట్టలంకలో ఏళ్ల తరబడి వాటర్ ట్యాంకు నిర్మాణంలో జాప్యం జరగటానికి కారణం అధికారుల నిర్లక్ష్యమా, ప్రభుత్వ అలసత్వమా అంటూ సర్పంచ్ మోకా రామారావు, ఎంపీటీసీ మట్టపర్తి సురేష్ నిలదీశారు. ప్రధాన సమస్యగా ఉన్న తాగునీటి సమస్యపై చర్చించేందుకు ఆ శాఖాధికారి అందుబాటులో లేరని, ఇంకెవరికి చెప్పుకోవాలంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని, అధికారులు లేని సమావేశాలెందుకంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎంపీడీఓ టి.వెంకటాచార్య మాట్లాడుతూ, సంబంధిత ఇంజినీరింగ్ అధికారి అత్యవసర పనిపై ముందుగా సమాచారమిచ్చి వెళ్లారని, ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకువెళ్తామన్నారు. గ్రామాలలో చేపడుతున్న అభివృద్ధి పనులపై కనీస సమాచారం కూడా స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియకుండా, రాజకీయ నాయకులే చేపడుతున్నారని అయినాపురం సర్పంచ్ మెకా రామారావు ఆరోపించారు. దీనిపై ఎంపీడీఓ, ఎంపీపీ వివరణ ఇస్తూ, గామాలలో చేపడుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులలో ప్రొటోకాల్ విధిగా పాటించాలని, అలా చేయని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. ఎంఈఓ డి.గౌరీశంకర్ మాట్లాడుతూ, మండలంలో పదో తరగతి పరీక్షలకు 7,347 మంది విద్యార్థులు హాజరు కానున్నారని, ఈ ఏడాది నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అయినాపురం ఎంపీటీసీ మట్టపర్తి సురేష్ మాట్లాడుతూ, మధ్యాహ్న భోజన పథకానికి రేషన్ బియ్యమే సరఫరా చేస్తున్నారని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని, వారికిచ్చే చెక్కీలో నాణ్యత ఉండడం లేదని ఆరోపించారు. దీనికై ఎంఈఓ గౌరిశంకర్ వివరణ ఇస్తూ, విద్యార్థులకు సన్న బియ్యం ఇవ్వాలని, అయితే రేషన్ బియ్యంలో పోషక విలువలున్నాయంటూ ఆ బియ్యాన్నే సరఫరా చేస్తున్నారన్నారు. చెక్కీ ప్యాకెట్లను రాజస్థాన్ నుంచి సరఫరా చేస్తున్నారని, దానిలో నాణ్యత తెలియడం లేదన్నారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మండలంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 921 పనులకు గాను రూ.7.33 కోట్లు వెచ్చించామన్నారు. 2,50,128 పనిదినాలు కల్పించామని, దినసరి వేతనం రూ.293 చెల్లించామని వివరించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్సై, హెచ్‌సీల సేవలు అభినందనీయం



ఎస్సై సత్యనారాయణ, హెచ్‌సీ భాస్కరరావును సత్కరిస్తున్న ఏఎస్పీ ప్రసాద్



వెంకటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ ఎస్సై కోట వీరవెంకట సత్యనారాయణ, ఆర్మ్‌డ్ హెడ్ కానిస్టేబుల్ ఇంటి భాస్కరరావు పోలీస్ శాఖలో దశాబ్దాల పాటు అందించిన సేవలు అభినందనీయమని ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన ఎస్సై సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ భాస్కరరావుకు స్థానిక ఎస్పీ కార్యాలయంలో వీడ్కోలు సభ జరిగింది. ఎలాంటి రిమార్కులు లేకుండా వీరు సేవలు అందించారని ఏఎస్పీ అభినందించారు. అనంతరం వీరికి ఘనంగా సత్కరించారు. ఆర్మ్‌డ్ ఆర్ఐ బ్రహ్మనందం, ఎస్పీ కార్యాలయ ఏవో జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఈవో వీరవెంకటేశ్వరరావుకు సత్కారం

జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖలో 44 ఏళ్లుగా వివిధ దేవస్థానాల్లో ఈవోగా పనిచేసి, ఉద్యోగ విరమణ చేస్తున్న కొత్తపేట మండలం పల్లాలమ్మ దేవస్థానం ఈవో బొక్కా వీరవెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమని జిల్లా అసిస్టెంట్ కమిషనర్లు, సహ ఈవోలు కొనియాడారు. స్థానిక వాసర్ల వెంకన్న గార్డెన్స్‌లో ఈవో వెంకటేశ్వరరావుకు శుక్రవారం రాత్రి ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. వివిధ దేవస్థానాల ఈవో, ఏసీలు ముదునూరి సత్యనారాయణరాజు, మాచిరాజు లక్ష్మీనారాయణ, అర్చకుల సంఘ అధ్యక్షుడు సుదర్శనం జగన్నాథచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐ వెంకటేశ్వరరావు సేవలు భేష్

అమలాపురం మున్సిపాలిటీలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పల్లి వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు కొనియాడారు. ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మున్సిపల్ కార్యాలయంలో వీడ్కోలు సభ జరిగింది. రెవెన్యూ అధికారి భూపతి శ్రీలక్ష్మి మాట్లాడుతూ, వెంకటేశ్వరరావు తన విధులను అంకిత భావంతో నిర్వర్తించారని గుర్తు చేశారు. అనంతరం వెంకటేశ్వరరావు, సత్య దంపతులను ఘనంగా సత్కరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు, యేడిద శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పార్టీలు సహకరించాలి

అమలాపురంరూరల్: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని డీఆర్ఓ బీఎల్ఎస్ రాజకుమారి కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డీఆర్ఓ చాబర్‌లో జిల్లాస్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ అవుతుందన్నారు. 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 11న ఉపసంహరణ ఉంటుందన్నారు. ఫిబ్రవరి 27న ఉదయం 8 నుండి సాయంత్రం 4 వరకు పోలింగ్ ఉంటుందని తెలిపారు. మార్చి మూడున ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 64,327 మంది పట్టభద్రులు నమోదయ్యారని చెప్పారు. 95 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశం

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు సొసైటీ జనరల్ బాడీ సమావేశం కోనసీమ జిల్లా చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ అధ్యక్షతన కలెక్టరేట్‌లో డీఆర్ఓ నిర్వహించారు. భవిష్యత్తులో సంస్థ చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు.

క్లుప్తంగా...

ఆక్రమిత భూములను కాపాడాలి

తాళ్లరేవు: జార్జిపేట పంచాయతీలో ఆక్రమణలో ఉన్న 85 సెంట్ల జిల్లా పరిషత్ భూములను కాపాడాలని పలు సంఘాల నాయకులు కోరారు. శుక్రవారం కేవీపీఎస్, ఎమ్మార్పీఎస్, సీపీఎం, వైఎస్సార్ సీపీ నాయకులు ఆ ప్రాంతాన్ని సందర్శించారు. ప్రభుత్వ స్థలాన్ని 27 మంది ఆక్రమించుకుని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు.

ఉప్పంగలలో పశు ఆరోగ్య శిబిరం

తాళ్లరేవు: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉప్పంగల పంచాయతీలో శుక్రవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. సుమారు 60 పశువులను పరీక్షించి, రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పీఎస్ఎఫ్‌కు విద్యార్థిని ఎంపిక

అమలాపురం రూరల్: ఎస్‌కేబీఆర్ కళాశాల విద్యార్థిని కె.పూర్ణిమా తేజస్విని పీఎస్ఎఫ్‌కు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ నూకల శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. అస్సాం కేడర్ త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నట్టు చెప్పారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అల్లవరం: దేవగుప్తంలో ఇటీవల అగ్ని ప్రమాదం జరిగి సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి జనసేన నాయకులు శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. రూ.8 వేలతో పాటు, 25 కేజీల బియ్యం, నిత్యావసరాలను అందజేశారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల స్వచ్ఛ భారత్

తాళ్లరేవు: నీలపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక ఆదర్శ పాఠశాల ప్రాంగణాన్ని శుక్రవారం సుంకరపాలెం ప్రకాష్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ వలంటీర్లు శుభ్రం చేశారు. రెండు రోజుల పాటు గ్రామంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మన్ననలు పొందేలా సేవలందించాలి

ఐ.పోలవరం: అందరి మన్ననలు పొందేలా సేవలు అందించాలని డీఈఓ షేక్ సలీం బాషా అన్నారు. మురమళ్ల జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఎంఈఓ తిరుమలరావుకు ఉద్యోగ విరమణ వీడ్కోలు సభ జరిగింది. ఎంఈఓ కొండారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తిరుమలరావు, నాగమణి దంపతులను సత్కరించారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరం

ముమ్మిడివరం: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సౌకర్యాలు మెరుగుపర్చేందుకు దాతల సహకారం అవసరమని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. ముమ్మిడివరం జీఎంసీ బాలయోగి బాలికోన్నత పాఠశాలకు కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ రూ.2.80 లక్షల విలువ చేసే ఆర్వో ప్లాంటును సమకూర్చారు. ఈ ప్లాంటును శుక్రవారం ఎమ్మెల్యే దాట్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ కార్పొరేషన్ వ్యాపారులు బీడీ వర్మ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

యానాం: పట్టణంలోని కనకాలపేటకు చెందిన 17 ఏళ్ల బాలిక అదృశ్యంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇలంగో తెలిపారు. స్థానిక శంకరపాలెంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఈ నెల 25న కళాశాలకు పరీక్షలు రాయడానికి వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి చేరలేదు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.